క్లుప్తంగా

పి- 4 సర్వే పటిష్టంగా నిర్వహించండి


అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ ప్రద్యుమ్నకుమార్

పర్చూరు(చినగంజాం): ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా గ్రామాల్లో పి- 4 సర్వే పటిష్టంగా నిర్వహించాలని పర్చూరు ఎంపీడీఓ వి- ప్రద్యుమ్నకుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో పీ 4 సర్వే నిర్వాహణపై గ్రామ కార్యదర్శులకు సచివాలయాల ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఈ నెల 8 వ తేదీ నుంచి సర్వే ప్రారంభించాలని తెలిపారు.

ఆదరణ లబ్ధిదారులకు పరికరాలు సిద్ధం


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మీనారాయణ

యద్దనపూడి: ఆదరణ-3 పథకం ద్వారా లబ్ధిదారులకు నాణ్యమైన పరికరాలు అందించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఆదరణ పథకంపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. ఆధునిక పనిముట్లు, వాటి నాణ్యత , కంపెనీల ఏజెన్సీల వివరాలు ఇవ్వాలని కోరారు. శనివారం మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు కట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తామని 90 రోజుల శిక్షణ అనంతరం వారికి ఉచితంగా కుట్టుమిషన్లు అందజేస్తామన్నారు. ఈఓఆర్డీ కృష్ణ, పంచాయతీ కార్యదర్శులు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

శనగ రైతులు లబోదిబో!

- గిట్టుబాటు ధర ఎక్కడ..?
- పెట్టుబడులు కూడా గగనమే..
- కొనేవారు కానరాక అవస్థలు

కారంచేడు: ప్రభుత్వాలను, పాలకులను నమ్ముకున్న రైతన్నలు నిండా మునిగిపోతున్నారు. రాత్రనక, పగలనక కష్టపడి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక, పెట్టిన పెట్టుబడలు వస్తాయో, రావో తెలియని లబోదిబోమంటున్నారు. పర్చూరు నియోజకవర్గంలోని కారంచేడు, పర్చూరు, యద్దనపూడి, మార్టూరు, ఇంకొల్లు, చినగంజాం మండలాల్లో సుమారు 20 నుంచి 22 వేల ఎకరాలకు పైగా శనగ పంటను సాగు చేశారు. గత ఏడాది శనగ పంటలకు ధరలు కొంత ఆశాజనకంగా ఉండటంతో రైతులు శనగ పంట వైపు మొగ్గు చూపారు.

నేడు నేలను చూస్తున్న ధరలు

ఒకప్పుడు ఆకాశాన్ని చూసిన శనగ ధరలు ప్రస్తుతం నేల చూపులు చూస్తున్నాయి. దీంతో శనగ రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కనీసం శ్రమకు తగిన ఫలితం దక్కుతుందో లేదో కూడా తెలియని స్థితిలో ఉన్నారు. గత ఏడాది తెల్ల శనగలకు క్వింటా రూ. 10,500 వరకు ఉంటే ఈ ఏడాది రూ. 6500 మాత్రమే ఉందని రైతులు చెబుతున్నారు. అసలు అడిగే నాథుడు కరువయ్యాడని వారు వాపోతున్నారు. ఎర్ర శనగలు గత ఏడాది బస్తా రూ. 7500 వరకు ఉంటే ఇప్పుడు కేవలం రూ. 4500 నుంచి 5500 వరకు మాత్రమే ఉంది.


ఆదిపూడి రోడ్డులో శనగ పంటను మిషన్లో వేస్తున్న వ్యవసాయ కూలీలు

దిగుబడులున్నా.. ధరలేవి..?

శనగ పంటలో ఈ ఏడాది దిగుబడులు కొంత ఆశాజనకంగానే ఉన్నాయి. గత ఏడాదితో పోల్చుకుంటే దిగుబడులు బాగున్నాయి. ఎకరానికి 8-11 బస్తాల వరకు శనగలు దిగుబడులు వచ్చాయి. అయితే అందుకు తగినట్లు ధరలు లేవు. గత ఏడాది ఎకరా కౌలు రూ. 25000 ఉంటే ప్రస్తుతం రూ. 35000 వరకు ఉంది. కౌలు ధరలతో పాటు ఎకరాకి కనీస పెట్టుబడి రూ. 25వేల నుంచి రూ. 30వేల వరకు అయ్యాయి. అంటే ఎకరానికి కౌలు ధరలతో పాటు పెట్టుబడులు కలిపితే సగటున రూ. 60 వేల వరకు ఖర్చు అయినట్లే. ఎకరాకి కేవలం సగటున 8 బస్తాల చొప్పున వచ్చినా బస్తా రూ. 5500 చొప్పున వేసుకున్నా వచ్చేది రూ. 44 వేలు. కానీ మొత్తం ఎకరాకు ఖర్చు రూ. 60 వేలు. దీనిప్రకారం ఎకరానికి రూ. 10 నుంచి రూ. 15 వేల వరకు నష్టం వాటిల్లే ప్రమాదముంది. కాబట్టి పాలకు గిట్టుబాటు ధరలపై దృష్టి పెట్టి రైతుకు పంటకు తగిన ధరలను కల్పించి ఆత్మహత్యలు జరగకుండా నివారించేలా చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

> **గిట్టుబాటు ధరతో కొనుగోలు చెయ్యాలి**
>
> శనగ పంటకు గిట్టుబాటు ధరలు లేవు. అయినా పెట్టిన పెట్టుబడులకు వడ్డీలు కట్టలేక అయినకాడికి అమ్ముకోవాలనుకున్నా.. అన్నదాతకు చుక్కెదురవుతోంది. పెట్టుబడులు మొత్తం స్తంభించిపోయాయి.
>
> – వై. శ్రీనివాసరావు

> **పెట్టుబడులకు ఎదురు చూపులే,,**
>
> ఈ ఏడాది శనగ రైతులకు పెట్టుబడులు కూడా కష్టంగా మారే పరిస్థితులున్నాయి. గత ఏడాది కూడా పెట్టిన పెట్టుబడులు రాకపోవడంతో ఈ ఏడాది అయినా లాభాలు వస్తాయని ఆశించిన శనగ రైతులకు నిరాశే మిగులుతోంది. రాబోవు రోజుల్లో శనగ పంటను సాగు చెయ్యాలా వద్దా అని రైతులు సందిగ్ధంలో ఉన్నారు. రైతులను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలు చేసుకోవాల్సి పరిస్థితులు ఏర్పడేలా ఉన్నాయి.
>
> – డి. నాగశ్రీనివాసరావు, రైతు, కారంచేడు


కారంచేడు ప్రాంతంలో సాగు చేసిన శనగ పంట


చీరాల : టగ్ ఆఫ్ వార్‌లో తలపడుతున్న రెవెన్యూ మహిళా ఉద్యోగులు

అన్ని రంగాల్లో అభివృద్ధి అవసరం

పర్చూరు (చినగంజాం): మహిళలు అన్ని రంగాల్లో ముందుకు రావాలని పర్చూరు అంగన్‌వాడీ సీడీపీఓ సుభద్ర అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రాజెక్టు లెవెల్ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు సమావేశాలకు వచ్చినప్పుడు కూర్చోవడానికి వీలుగా 100 కుర్చీలను, ఒక టేబుల్‌ను నాగులపాలెం చెందిన కొల్లా సుభాష్ గారు వారి సతీమణి జెడ్పీటీసీ కొల్లా గంగాభవాని గారి జ్ఞాపకార్థం అందజేశారు.


కారంచేడు: హఫీజాకు ఉత్తమ సేవా పురస్కారం అందిస్తున్న సీడీపీఓ ఝాన్సీ

చీరాల అర్బన్: జీవీఆర్ అల్ఫా కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శనివారం నుంచి ఈ నెల 31వ తేదీ వరకు గైనకాలజీ విభాగంలో ఉచిత ఓపీ సేవలు అందించనున్నారు. ఈమేరకు డాక్టర్ పల్లె ప్రదీప్ రతన్ తెలిపారు. హాస్పిటల్ మొదటి వార్షికోత్సవం సందర్భంగా ఉచిత ఓపీ సేవలందిస్తామన్నారు.


అద్దంకి:మహిళా అధికారులను సన్మానిస్తున్న ప్రతినిధులు

అద్దంకి రూరల్: మహిళా చట్టాల పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ కృషి చెయ్యాలని కొరిశపాడు ప్రాజెక్టు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి అద్దంకి కృష్ణకుమారి అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఏపీఎం గాయత్రి, ఉత్తమ ఉపాధ్యాయులు రామలక్ష్మి, ఎస్. నాగమల్లిక, సీడీపీవో అద్దంకి కృష్ణకుమారి పాల్గొన్నారు.


అద్దంకి: మహిళా అధికారులను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

మేదరమెట్ల: అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని మేదరమెట్ల పోలీసుల ఆధ్వర్యంలో ఈనెల 1వ తేదీ నుంచి నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి శుక్రవారం బహుమతులను అందచేశారు. బాపట్ల రూరల్ సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ మహ్మద్ రఫీ, చిన్నారులు పాల్గొన్నారు.


బల్లికురవలో మాట్లాడుతున్న ఎంపీపీ

సమస్యలు పరిష్కరించండి

చీరాల టౌన్: పంచాయతీల కార్యదర్శులు విధులను సమర్థవంతంగా నిర్వహించి గ్రామ పంచాయతీలను అభివృద్ధిలో ముందంజలో ఉంచాలని ఎంపీడీఓ పి.శివసుబ్రమణ్యం సూచించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ పంచాయతీల సెక్రటరీలు, గ్రామ సచివాలయాల వెల్ఫేర్, డిజిటల్ అసిస్టెంట్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈవోఆర్డీ రామకృష్ణ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం

సంతమాగులూరు(అద్దంకి): ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు పండించవచ్చని ఏసీఆర్‌ఎంటీ శిరీష అన్నారు. శుక్రవారం ఐసీఆర్‌ఎంటీ ఆధ్వర్యంలో పొగాకు, ఆవు మూత్రం, వెల్లుల్లి, పచ్చిమిర్చి ఉపయోగించి పురుగుమందులకు పిచికారీ చేసే కషాయాన్ని తయారు చేసి చూపించారు. రసాయన ఎరువులు, పురుగుమందుల పిచికారీతో పంటల ఉత్పత్తులు విషతుల్యం అవుతాయన్నారు. సుధారాణి, నాగూర్‌వలి, హైమావతి, రవణమ్మ రైతులు పాల్గొన్నారు.


కషాయాల తయారీ ఇలా..

100 శాతం ఉత్తీర్ణత సాధించాలి

వేటపాలెం: మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చర్యలు చేపట్టాలని డిప్యూటీ ఎడ్యుకేషన్ అధికారి డి. గంగాధర్‌రావు సూచించారు. మండలం పరిధిలోని దేశాయిపేట, వేటపాలెం జెడ్పీ హైస్కూల్‌ను డిప్యూటీ ఈఓ శుక్రవారం తనిఖీ చేశారు.

బీమాతో ధీమా


బల్లికురవలో బీమా చెక్కు అందజేస్తున్న చీఫ్ మేనేజర్

బల్లికురవ: బ్యాంకు ఖాతాదారులు ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతి, ప్రధాన మంతి సురక్ష బీమా యోజనలో ప్రీమియంలు చెల్లిస్తే ప్రమాదం సంభవించినప్పుడు బీమా సొమ్ము పొందవచ్చని బల్లికురవ ఏపీజీబీ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ కె. సీనానాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని గుంటుపల్లి గ్రామానికి చెందిన పి. హరిబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో చనిపోగా ఆయన భార్య సుజాతకు రెండు పథకాలకు సంబంధించి రూ. 4 లక్షల చెక్కులను అందజేశారు. బ్యాంకు మేనేజర్ రవీంద్రబాబు పాల్గొన్నారు.

స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాల ఏర్పాటు


స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాల సభ్యులతో ఉపాధ్యాయులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని బాలబాలికలతో స్కౌట్స్ అండ్ గైడ్స్ బృందాలను శుక్రవారం ప్రధానోపాధ్యాయుడు అంజయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. బాలుర స్కౌట్స్‌కు టంగుటూరి ప్రకాశం, బాలికల గైడ్స్‌కు కస్తూర్బా గాంధీ బృందాలుగా నామకరణం చేశారు. స్కౌట్స్‌కు వి.సుబ్రహ్మణ్యం, గైడ్స్‌కు జ్వాలా లక్ష్మమ్మలను ఎంపిక చేశారు.

ఆటో ఢీకొని వ్యక్తికి గాయాలు

అద్దంకి రూరల్: సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఆటో ఢీకొట్టటంతో గాయాలపాలైన సంఘటన శుక్రవారం అద్దంకి సమీపంలో చోటు చేసుకుంది. వెంపరాలకు చెందిన మందా కోటేశ్వరరావు సైకిల్‌పై వెళుతుండగా స్థానిక కలవకూరు రోడ్డులోని రైస్‌మిల్లు సమీపంలోకి రాగానే వెనుకవస్తున్న ఆటో ఢీకొట్టటంతో గాయాలపాలయ్యాడు. అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

13న సామూహిక సాగర హారతి

చీరాల టౌన్: మండలంలోని వాడరేవు సముద్ర తీరం ఒడ్డున ఈనెల 13న హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో పౌర్ణమి సందర్భంగా సామూహిక సాగర హారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని నియోజకవర్గ ప్రతినిధి తాడివలస దేవరాజ్ తెలిపారు. వాడరేవు తీరం ఒడ్డున ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం వద్ద నిర్వహించే సామూహిక సాగర హారతిలో భాగంగా స్పటిక శివలింగానికి ప్రత్యేక పూజలు, పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు, భజనలు మంత్ర పుష్పం, సాగర హారతి నిర్వహిస్తామన్నారు. పౌర్ణమి సాగర హారతి కార్యక్రమానికి నియోజకవర్గంలోని భక్తులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనాలని దేవరాజ్ సూచించారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం పాల్గుణ మాసం మృగశిర నక్షత్రం నవమి తిథి సందర్భంగా శనివారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు శుక్రవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న శనివారం ఆంజేఏయ స్వామికి ఇష్టమైన ఆకు పూజ చేస్తే కోరినకోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం , మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంలకు శ్రీసువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయస్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.



స్త్రీలు అన్ని రంగాల్లో రాణించాలి

- ఘనంగా మహిళా దినోత్సవం

చీరాల టౌన్: పురుషులతో పాటు మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తేనే సమాజంలో వివక్షత లేకుండా ఉంటుందని, మహిళలు మహారాణులని చీరాల ఆర్డీవో తూమాటి చంద్రశేఖర నాయుడు అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం చీరాల ఆర్డీవో కార్యాలయం పరిధిలోని చీరాల, వేటపాలెం, చినగంజాం, కారంచేడు మండలాల్లోని రెవెన్యూ ఉద్యోగులు మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ మైదానంలో మహిళా ఉద్యోగులకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్, టగ్ ఆఫ్ వార్, పలు ఆటల పోటీలను నిర్వహించారు. తహసీల్దార్లు కుర్రా గోపీకృష్ణ, జీవిగుంట ప్రభాకరరావు, సర్వే ఇన్‌స్పెక్టర్ జీవీ ముసలయ్య సిబ్బంది పాల్గొన్నారు.


మేదరమెట్లలో బహుమతులు అందుకున్న విద్యార్థినులతో సీఐ, ఎస్ఐ

అద్దంకి: పట్టణంలోని కట్టారామకోటేశ్వరరావు డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ వి. రామ్మోహనరావు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వాణిజ్య విభాగ అధ్యాపకురాలు వి. పద్మావతి ఉపన్యసించారు.

అద్దంకి: అంతర్జాతీయ మహిళా దినోత్సవ ముగింపు వేడుకలు శుక్రవారం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎంఈవో 2 బి. సుధాకర్, సీడీపీవో కృష్ణకుమారి, మహిళా ఉపాధ్యాయులు కె. రామలక్ష్మి, ఏపీవో గాయత్రి, నాగవల్లిని హెల్ప్ స్వచ్ఛంధ సంస్థ కో ఆర్డినేటర్ సాగర్ బృందం ఘనంగా సన్మానించారు. సూపర్‌వైజర్లు అరుణ, బి. ఇందిర, కె. రమాదేవి పాల్గొన్నారు.

కారంచేడు: అంగన్‌వాడీ కేంద్రం ద్వారా పేద ప్రజలకు, గర్భిణుకు, బాలింతలకు, చిన్నారులకు అందించాల్సిన అన్ని రకాల సేవలను సక్రమంగా అందించడంలో కృషి చేసిన షేక్ హఫీజాకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. మహిళాదినోత్సవాన్ని పురష్కరించుకొని ఐసీడీఎస్ ఇంకొల్లు ప్రాజెక్టు పరిధిలో కారంచేడు మండలం నుంచి దగ్గుబాడు గ్రామానికి చెందిన హఫీజాను ఎంపిక చేసినట్లు సీడీపీఓ తిరుమలశెట్టి ఝాన్సీ అన్నారు.

బల్లికురవ: మహిళలే మహారాణులని ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అన్నారు. శుక్రవారం స్థానిక పరిషత్ కార్యాలయంలో అంర్జాతీయ మహిళా దినోత్సవ సదస్సు నిర్వహించారు. కేజీబీవీ ప్రిన్సిపాల్ కె. సరళకుమారి, పవువైద్యాధికారి ఆర్. పావని కుమారి, బల్లికురవ ఎంపీటీసీ టి. రాహేలు, పి.హరిహరరెడ్డి పాల్గొని మాట్లాడారు.

చీరాల: అన్ని రంగాల్లో మహిళలు ప్రథమ స్థానంలో కొనసాగుతున్నారని, వారందరిని స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో స్థిరపడాలని డీఎస్పీ ఎండి మొయిన్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చీరాల ఇంజినీరింగ్ కాలేజీ క్యాంపస్‌లో కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రైనీ డీఎస్పీ అభిషేక్, రూరల్ సీఐ శేషగిరిరావు, ఈపూరుపాలెం ఎస్సై అంబటి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో తేలప్రోలు వీరయ్య, వెంకాయమ్మ కళ్యాణ మండపంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

చీరాల అర్బన్: లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకున్నవారు, చేసిన వారు శిక్షార్హులని వక్తలు తెలిపారు. పట్టణంలోని సి-సెక్టార్ పరిధిలోని వైకుంఠపురం జాలమ్మ గుడి వద్ద అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఇంద్రాణి, రోజాకుమారి, గ్లోరి విజయకుమారి పాల్గొన్నారు.